క్లుప్తంగా

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై శుక్రవారం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. విజయవాడ విద్యాధరపురానికి చెందిన వాగ్దేవి కూచిపూడి నృత్యాలయానికి చెందిన పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ప్రదర్శించిన కూచిపూడి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్యకారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందచేశారు.

అంకిత భావంతో పని చేస్తే ఉద్యోగోన్నతులు



భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురంలోని ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్ వర్క్స్ మేనేజర్ ఎ.వాణిశ్రీకి శుక్రవారం వీడ్కోలు సభ జరిగింది. ఆర్టీసీలో సాధారణ బదిలీల్లో భాగంగా జోనల్ వర్క్‌షాప్‌లో డబ్ల్యుఎమ్‌గా పని చేసి కృష్ణా జిల్లా డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ (డీపీటీఓ)గా బదిలీ అయి వెళుతున్న సందర్భంగా ఆర్టీసీ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా వర్క్స్ మేనేజర్‌గా ఒక మహిళ విధులు నిర్వర్తించి అందరి చేత శభాష్ అనిపించుకోవడం సామాన్యమైన విషయం కాదన్నారు. అంకిత భావంతో పని చేస్తే పదోన్నతులు వాటంతటవే వస్తాయన్నారు. ముఖ్యంగా వర్క్‌షాప్‌లో ప్రతి ఉద్యోగి పట్ల ఆమె చూపిన ఆత్మీయ అభిమానాలు అభినందనీయమని పేర్కొన్నారు. డెప్యూటీ చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసర్ రామచంద్రరావు, కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్ ఉషారాణి, వర్క్‌షాప్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగస్తులు వాణిశ్రీని సత్కరించి అభినందించారు.

డిజిటల్ ఫ్లోట్ యాక్టివేషన్ ప్రారంభం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారతదేశంలోని ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ ఇటీవల తన గ్రామీణ అవుట్ లెట్లలో డిజిటల్ ఫ్లోట్ యాక్టివేషన్ ప్రారంభించింది. ఇందులో భాగంగా శుక్రవారం విజయవాడ రామవరప్పాడు రింగు వద్దగల సాయిస్వర్ణ హ్యుందాయ్‌లో ఈ డిజిటల్ ఫ్లోట్ యాక్టివేషన్ ను కంపెనీ అధికారులు ధీరజ్ , హరితేజ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ మాట్లాడుతూ సెమీ అర్బన్, రూరల్ ప్రాంతాల్లో తమ కార్లపై మరింత అవగాహన, ప్రచారాన్ని కల్పించాలని ఉద్దేశంతో డిజిటల్ ఫ్లోట్ కాన్సెప్ట్ పరిచయం చేశామని పేర్కొన్నారు. హ్యుందాయ్ యొక్క అత్యంత ఇష్టపడే హ్యాచ్ బ్యాక్ 'గ్రాండ్ ఐ10 నియోస్' నేరుగా వినియోగదారులు ఇంటివద్దకే డెలివరి చేయబడుతుందన్నారు. షోరూమ్ జనరల్ మేనేజర్ భగత్ సింగ్ మాట్లాడుతూ తమ షోరూమ్ పరిధిలోని గుడివాడ , నూజివీడు పరిసర గ్రామీణ ప్రాంతాలలో డిజిటల్ ఫ్లోట్ యాక్టివేషన్ రూపకల్పన చేసినట్లు తెలిపారు.

హాయిగా నవ్వుకునేలా అన్‌స్టాపబుల్ సినిమా



లబ్బీపేట(విజయవాడతూర్పు): కుటుంబంతో సహా థియేటర్‌కి వచ్చి హాయిగా నవ్వుకునేలా 'అన్‌స్టాపబుల్' ఉంటుందని ఆ సినిమా హీరో వీజే సన్నీ అన్నారు. బిగ్‌బాస్ విన్నర్ వీజే సన్నీ హీరోగా నటించిన అన్‌స్టాపబుల్ సినిమా ఈ నెల 9న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆ చిత్ర యూనిట్ సభ్యు లు శుక్రవారం నగరానికి విచ్చేశారు. అందులో భాగంగా పీవీపీ మాల్‌లో అభిమానులను కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా వీజే సన్నీ మాట్లాడుతూ రత్నబాబు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో నక్షత్ర, అక్సాఖాన్‌లు హీరోయిన్లుగా న టించినట్లు తెలిపారు. ఎ2బి ఇండియా ప్రొడక్షన్‌లో రంజిత్‌రావు నిర్మాతగా హైదరాబాద్, నిజామాబాద్, గోవా వంటి ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరిగినట్లు పేర్కొన్నారు. ఈ సినిమాకు సంబంధించి పోస్టర్లు, టీజర్‌ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయన్నారు. హాస్యం కోరుకునే ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకుని ఈ చిత్రాన్ని డైరెక్టర్ చాలా చక్కగా తీశారని తెలిపారు. దర్శకులు రత్నబాబు, నిర్మాత రంజిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ప్యారిస్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ (ఫైల్)

మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): రానున్న రోజుల్లో విజయవాడ నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దనున్నామని, అందుకు ప్రజల సహకారం కావాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ (యుఎన్ఇపీ) ఆధ్వర్యంలో గత నెల 25వ తేదీ నుంచి 28 వరకు ఫ్రాన్స్‌లోని ప్యారిస్ నగరంలో 'నగరాల్లో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేసేందుకు అంతర్జాతీయ ఫోరమ్' కాన్ఫరెన్స్‌లో తీసుకున్న నిర్ణయాలు, ప్యారిస్ పర్యటన అనుభవాలను ఆయన మీడియాతో పంచుకున్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి సూచనలతో ప్యారిస్‌లో అర్బన్ డెవలప్‌మెంట్ ఎలా జరుగుతుందన్న అంశంపై పరిశీలనకు వెళ్లామని చెప్పారు. హౌసింగ్ అండ్ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (భారత ప్రభుత్వం) సహకారంతో ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్వహించడం, అలాగే నగరాల్లో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం అనే ప్రక్రియను దేశవ్యాప్తంగా బలోపేతం చేయడమే ఈ ఫోరమ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నాం...

ప్యారిస్ కాన్ఫరెన్స్‌లో దేశంలోని మూడు నగరాలు ప్రాతినిధ్యం వహించగా అందులో విజయవాడ నగరం ఒకటని తెలిపారు. అందులో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విధానాన్ని తాను వివరించినట్లు చెప్పారు. నగరంలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టేందుకు నగర పాలక సంస్థ సుస్థిరమైన, సమ్మిళిత విధానంపై దృష్టి సారించిందని, అందుకు అవసరమైన చర్యలు ఇప్పటికే తీసుకున్నామన్నారు. నగరం, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించటం, నియంత్రించటంలో ప్రజలకు అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులను చేస్తున్నామని తెలిపారు. నగరాలు, రాష్ట్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్‌తోపాటు పునర్వినియోగాన్ని పర్యవేక్షించటం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై జాతీయ స్థాయి మార్గదర్శకాలను అనుసరించేందుకు జాతీయ డిజిటల్ ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేయాలని ఈ ఫోరంలో ప్రతిపాదించామన్నారు.

కాన్ఫరెన్స్‌లోని ఆలోచనలు అమలు చేస్తాం...

ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేయడం ద్వారా ప్లాస్టిక్ వాడకం చాలా వరకు తగ్గుతుందని, ఈపీఆర్ విధానం ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టవచ్చన్నారు. ఇందు కోసం జాతీయ స్థాయి పోర్టల్ ఉండాలన్నారు. ప్యారిస్ కాన్ఫరెన్స్ ద్వారా పంచుకున్న ఆలోచనలను నగరంలో అమలు చేస్తామని తెలిపారు. విజయవాడ నగరంలో తడి చెత్త, పొడి చెత్త రీసైక్లింగ్ విధానాన్ని ఆయన ప్రశంసించారు. ప్యారిస్ నగరంలోని రోడ్లతో పోల్చుకుంటే విజయవాడ రోడ్లు బాగున్నాయన్నారు. చెత్తను కాలువల్లో, బయట పడేయకుండా ప్రతి రోజూ ఇంటికి వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి ఇచ్చి నగరపాలక సంస్థకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనుల పరిశీలన



అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ స్వరాజ్య మైదానంలో ఎంతో అద్భుతంగా జరుగుతున్న అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నిర్మాణ పనులను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులకు సూచించారు. గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్‌స్కేప్, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. విగ్రహానికి సంబంధించిన అన్ని విడి భాగాలను కలిపి అత్యంత జాగ్రత్తగా పూర్తి చేయాలని కోరారు. ఇది ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అద్భుతమైన ప్రాజెక్ట్ అన్నారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా చేయాలని సూచించారు. ప్రధాన విగ్రహంతోపాటు మిగిలిన పనులూ అనుకున్న సమయంలో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ



47వ డివిజన్‌లో పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో కార్పొరేటర్ గోదావరి గంగ



40వ డివిజన్‌లో ఇళ్ల పట్టాలు అందిస్తున్న కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): దశాబ్దాల కాలంగా సొంతింటి కోసం తాము కంటున్న కలను నెరవేర్చిన ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞులమై ఉంటామని పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పలువురు మహిళా లబ్ధిదారులు అన్నారు. శాసన రాజధాని గ్రామం నిడమర్రు లేఅవుట్‌లో మంజూరయిన ఇళ్ల పట్టాలను స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వివిధ డివిజన్ల కార్పొరేటర్లు తమ డివిజన్ల పరిధిలోని లబ్ధిదారులకు శుక్రవారం ఆయా సచివాలయాల్లో ఇళ్ల పట్టాలను అందచేశారు. చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని లబ్ధిదారులకు స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగ పట్టాలను అందచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గోదావరి బాబు, డివిజన్ అధ్యక్షుడు, సింహాచలం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు కూరాకుల నాగ, సచివాలయ వీఆర్వో శ్రీనివాస్, ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

భవానీపురం 40వ డివిజన్‌లో 121, 122, 123, 124 వార్డ్ సచివాలయాల పరిధిలో 1356 మందికి కార్పొరేటర్, వీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ యరడ్ల ఆంజనేయరెడ్డి ఇళ్ల పట్టాలను అందచేశారు. కార్యక్రమంలో ఆయా సచివాలయాల వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా 43వ డివిజన్ 126వ వార్డ్ సచివాలయం వీఆర్వో సుధీర్ వర్మ నేతృత్వంలో వాలంటీర్ వెన్న భవానీ సీ14 క్లస్టర్ పరిధిలోని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందచేశారు.

ఫుట్‌పాత్ వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి

కలెక్టర్ ఢిల్లీరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చిరు వ్యాపారాలు చేసే పేదలకు ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించి పాదచారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయవాడ నగరాభివృద్ధిలో భాగంగా ఫుట్‌పాత్‌ల సుందరీకరణపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పాదచారులకు మరింత సౌకర్యం కల్పించడంతోపాటు ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకే ఫుట్‌పాత్‌లను ఆధునికీకరణ చేస్తున్నట్లు చెప్పారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే ఫుట్‌పాత్‌ల ఆధునికీకరణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఫుట్‌పాత్‌లపై చేపలు, రొయ్యలు వంటి ఉత్పత్తులను విక్రయిస్తున్నారని, వాటిని శుభ్రపరచక పోవడం వల్ల దుర్గంధం వ్యాపిస్తోందన్నారు. పంచాయతీ, రెవెన్యూ, సంక్షేమ అధికారులు ఫుట్‌పాత్‌లపై చిరువ్యాపారాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజన సంక్షేమ అధికారి యం. రుక్మాంగదయ్య, డీపీఓ జె. సునీత, విజయవాడ రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శేషగిరిరావు, తహసీల్దార్ జాహ్నవి పాల్గొన్నారు.

నేడు లలితాంబికాకు అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ లలితాంబికా పీఠంలో అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 6 గంటలకు పీఠం ఆవరణలోని వారాహి అమ్మవారికి పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

రేపు పౌర్ణమి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కళ్యాణార్థం, భక్త జన శ్రేయస్సును కాంక్షిస్తూ పౌర్ణమి గిరి ప్రదక్షిణ ఆదివారం నిర్వహించనున్నట్లు దుర్గగుడి వైదిక కమిటీ పేర్కొంది. 4వ తేదీ తెల్లవారుజామున 5–55 గంటలకు దుర్గాఘాట్‌లోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. పల్లకిపై దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులు కొలువు తీరగా, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గిరి ప్రదక్షిణ కొనసాగుతుంది. సుమారు 7 కిలోమీటర్ల మేర సాగే ఈ గిరి ప్రదక్షిణలో అమ్మవారి భక్తులు, భవానీలు, సేవా బృంద సభ్యులు పాల్గొనాలని ఆలయ అధికారులు కోరారు. దేవస్థాన ఘాట్ రోడ్డు నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితారా, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదగా కనకదుర్గనగర్, మహా మండపానికి చేరుకుంటుంది.

వైఎస్సార్ బీమా కుటుంబానికి భరోసా

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ బీమా పథకం పేద కుటుంబాలకు భరోసా ఇస్తుందని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూలై 1వ తేదీ నుంచి వైఎస్సార్ బీమా పథకం అమలుకు కార్మిక శాఖ ఉత్తర్వులు ఇవ్వటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా బీమా కంపెనీలు, బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా గ్రామ/వార్డ్ సచివాలయాల ద్వారానే బీమా పరిహారం చెల్లింపును చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించినా లేదా శాశ్వత వైకల్యం కలిగినా ఆ కుటుంబానికి రూ.5 లక్షలు, సహజ మరణానికి లక్ష రూపాయలు పరిహారాన్ని అందించేలా చర్యలు చేపట్టి ఆ ఇంటి పెద్ద కొడుకుగా ధైర్యాన్నిచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రోడ్డుపై నిలిపి ఉంచిన లారీ ఢీకొని వృద్ధుడికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరు జిల్లా కొలనుకొండకు చెందిన వేముల కొండ శివయ్య పని మీద కొత్తూరు తాడేపల్లి వచ్చారు. నైనవరం కట్ట నుంచి కొత్తూరు తాడేపల్లి వెళ్లుతుండగా చీకట్లో రోడ్డు మీద నిలిపి ఉంచిన లారీని ఢీ కొట్టాడు. దీంతో శివయ్య తలకు, చేతి వేళ్లకు, ఛాతీ భాగంలో గాయాలయ్యాయి. బాధితుడిని 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మూడు కాలువల శుభ్రతకు చర్యలు

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కాలువలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ):మిషన్ కృష్ణ - గోదావరి కాలువల (ఎమ్‌సీకెజీసీ) శుభ్రతకు నగర పాలక సంస్థ చేపట్టిన చర్యల్లో భాగంగా నగరంలోని బందరు, ఏలూరు, రైవస్ కాలువల ప్రక్షాళన కోసం నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏలూరు లాకుల వద్ద పేరుకుపోయిన చెత్త చెదారం ఉండటం, మురుగునీరు సక్రమంగా ప్రవహించక పోవడం గమనించారు. వెంటనే దానిని శుభ్రం చేయాలని ప్రజారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నగరంలోని మూడు కాలువల ప్రక్షాళన కోసం ఒక్కో కాలువకు 200 మంది చొప్పున మొత్తం 600 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించిన నేపథ్యంలో వారి పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని నోడల్ ఆఫీసర్లకు సూచించారు. కెనాల్ బండ్స్ సుందరీకరణ ప్రక్రియలో భాగంగా కాలువల పక్కన చెత్త, వ్యర్థాలను వేయకుండా చూడాలన్నారు. జల కాలుష్యాన్ని తగ్గించి ప్రజల జీవితాలకు హాని కలుగకుండా చేయాలని కోరారు. కాలువల్లో చెత్త, బిల్డింగ్ వ్యర్థాలను వేయకూడదని, అలాగే నగరంలో ఉన్న మూడు కాలువలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నారాయణమూర్తి, శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితర సిబ్బంది ఉన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్



మాట్లాడుతున్న శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందచేయడమే లక్ష్యంగా పని చేయాలని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. విజయవాడ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల చాంబర్‌లో నిర్వహించిన బోర్డ్ మీటింగ్‌కు ఆయన అధ్యక్షత వహించగా పర్సన్ ఇన్‌చార్జ్ ఆకేపాటి కృష్ణమోహన్, 56 కార్పొరేషన్ల కో ఆర్డినేటర్ అగ్రహారం ప్రవీణ్, బోర్డ్ డైరెక్టర్లు జి.సుబ్రహ్మణ్యం, కె.శ్రీదేవి, జెటీవీవీ ప్రసాద్, బి. లక్ష్మీకాంతం, జి.రజని, ఎం. భారతి, ఎల్.రాజగోపాలాచారి, దార్ల సూర్య ప్రభావతి పాల్గొన్నారు. తొలుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఈ సమావేశంలో చేసిన పలు తీర్మానాలు ఇలా ఉన్నాయి. విజయవాడ జింఖానా గ్రౌండ్ వద్ద విశ్వబ్రాహ్మణుల అపకర్మల భవనానికి స్థలం కేటాయించినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. తిరుమల తిరుపతి, ద్వారకా తిరుమలలో బ్రహ్మంగారి మఠం నిర్మాణం, వసతి గృహాలకు స్థలం కేటాయించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో చేదోడు పథకాన్ని విశ్వబ్రాహ్మణులకూ వర్తింపచేయాలని విన్నవించారు. విజయవాడ, విశాఖ, తిరుపతిలో విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు వసతి గృహాలను నిర్మించేందుకు 2000 చదరపు గజాల చొప్పున స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

రోగులు, సహాయకులకు ఉచిత భోజనం



ఉచిత భోజన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పాత ప్రభుత్వాస్పత్రికి నిత్యం వందలాది మంది ఓపీ రోగులు వస్తుంటారు. ప్రసవం కోసం వచ్చిన గర్భిణుల కుటుంబ సభ్యులు సైతం పెద్ద సంఖ్యలో బయట వేచి ఉంటారు. ప్రభుత్వాస్పత్రికి వచ్చేది ఎక్కువ మంది పేద, మధ్య తరగతి వాళ్లే ఉంటారు. ఇన్‌పేషెంట్స్‌కు ఆస్పత్రిలోనే భోజనం పెట్టినప్పటికీ, వారి వద్ద ఉండే సహాయకులు, బయట వేచి ఉన్న వారు భోజనానికి కొంత ఇబ్బంది పడాల్సి ఉంటుంది. అలాంటి వారి కోసం అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫుడ్ క్యాబిన్ ఏర్పాటు చేసి ఉచిత భోజన పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం మాజీ మంత్రి వెస్ట్ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. ప్రతిరోజూ ఇంటి తరహా భోజనం అందించడంతో పాటు, చల్లని మంచినీరు ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆకలి, దాహార్తిని తీర్చడం చాలా మంచి పరిణామం అన్నారు. అన్న సంతర్పణ సమితి సేవలు మరింత విస్తరింపచేయాలని ఆకాంక్షించారు. కాగా క్యాబిన్ ఏర్పాటుకు సహకరించిన పువ్వాడ కుశనాథ్ గుప్తాను అన్న సంతర్పణ సమితి కార్యదర్శి పీఎస్ఆర్ మూర్తి అభినందించారు. కార్యక్రమంలో పలువురు సమితి సభ్యులు పాల్గొన్నారు. తొలిరోజు 250 మందికి ఉచిత భోజన పంపిణీ జరిగింది. ప్రతిరోజూ 200 నుంచి 250 మందికి పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆకట్టుకున్న సాంఘిక నాటికలు



కొత్తతరం కొడుకు నాటికలోని సన్నివేశం

విజయవాడ కల్చరల్: శ్రీహర్ష క్రియేషన్స్ అండ్ వెల్‌ఫేర్ అసోసియేషన్ 5 వ వార్షికోత్సవం సందర్భంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ సాంఘిక నాటికల పోటీలు రెండవ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం నాటి ప్రదర్శనలు మణికంఠా ఆర్ట్స్ పిఠాపురం వారు కొత్తతరం కొడుకు నాటికను ప్రదర్శించారు. మూలకథ రావూరి కృష్ణారావు, నాటకీకరణ దర్శకత్వం చెలికాని వెంకట్రావు. రెండవనాటికగా మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్ చిలకలూరిపేటవారి మృత్యపత్రం, మాతృశ్రీ కళానికేతన్ వారి పనికిరాని వాడు నాటికలను ప్రదర్శించారు. హర్షక్రియేషన్స్ అధ్యక్షుడు కత్తి శ్యాంప్రసాద్. ప్రధానకార్యదర్శి పిళ్ళా నటరాజ్, నిర్వాహక కార్యదర్శి మల్లేశ్వర పట్నాయక్, క్రియాశీలక సభ్యులు అమృతవర్షిణి, గుడివాడ లహరి, ప్రేమకుమారి వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు సుఖమంచి కోటేశ్వరరావు, పోలుదాసు రంగనాయకులు పాల్గొన్నారు. కొప్పుల ఆనంద్ నాటికల పోటీలను పర్యవేక్షించారు. చిన్నారి చిద్విలాసిని చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. శనివారం ఇతిహాసం, ఆవిధంగా నాటికల ప్రదర్శనలతో పోటీలు ముగుస్తాయి. విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుంది.



చిద్విలాసిని కూచిపూడి నృత్యం

భాగవత శ్రవణం ముక్తికి మార్గం

విజయవాడ కల్చరల్: భాగవత శ్రవణం, పఠనం ముక్తికి మార్గమని ఆధ్యాత్మికవేత్త పురాణం మహేశ్వరశర్మ తెలిపారు. శివరామకృష్ణ క్షేత్రం స్వర్ణోత్సవంలో భాగంగా రామకోటిలోని శ్రవణ సదనంలో శుక్రవారం భాగవతసప్తాహం నిర్వహించారు. మహేశ్వరశర్మ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. భాగవత రామాయణాలు, భారతీయ ఆత్మ అని తెలిపారు. తెలుగు వారి జీవితాల్లో అవి భాగమని చెప్పారు. భాగవతం కేవలం భక్తుల కథలు మాత్రమే కాదని దుష్టశిక్షణకు శిష్ట రక్షణకు భగవంతుడు ఎత్తిన అవతారాల పరంపరగా అభివర్ణించారు. పోతన అనువదించిన భాగవతం తేలిగా అర్థం అవుతుందన్నారు. దానిని నిత్యం పూజించాల్సిన అవసరం ఉందన్నారు. శృంగేరి శివగంగ పీఠాధిపతులు పురుషోత్తమ భారతీ మహాస్వామి శివరామకృష్ణ క్షేత్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికమీద శారదా చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం వేదపండితులు సామవేద పారాయణం నిర్వహించారు. శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్, పూర్వపు ధర్మాధికారి ప్రభాకర శాస్త్రి పాల్గొన్నారు. భక్తులకు స్వామిజీ తీర్థప్రసాదాలను అందజేశారు.



• గోల్డెన్ లైట్‌లో చేపల వేట!

సూర్యాస్తమయం వేళ... సంధ్యా సమయాన భానుడి బంగారు కిరణాల వెలుగుల్లో బెరమ్ పార్కు వద్ద కృష్ణానదిలో చేపల వేట కోసం వల వేస్తున్న మత్స్యకారుడి చిత్రమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ